

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు
# వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలి



ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలపై అధికారులకు ఆదేశాలు జారీ చేస్తున్న కలెక్టర్ సంతోష్

**గద్వాల, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిపై ఎంపీడీఓలు,హౌసింగ్ అధికారులు, మునిసిపల్ కమీషనర్ లతో పనుల పురోగతిపై మండలాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 6,200 మందికి మంజూరు ఉత్తర్వులు అందించడం జరిగిందని, ఇప్పటి వరకు చాలా మంది లబ్ధిదారులు మార్కౌట్ చేసుకోలేదన్నారు. వివిధ కారణాల వల్ల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రాని వారి స్థానంలో అర్హులైన కొత్త లబ్ధిదారులకు ఇళ్లను మంజూరు చేసేందుకు ఇందిరమ్మ ఇండ్ల ఆఫ్‌లో అట్టి వారి వివరాలను నమోదు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల కోడ్ రాకముందే మార్కౌట్ చేసుకున్నట్లయితే అట్టి పనులకు కోడ్ వర్తించదని తెలుపుతూ, ప్రస్తుతం వర్షాలు కూడా తగ్గు ముఖం పట్టాయని, అవసరమైన ఇసుక కూడా అందుబాటులోకి వచ్చినందున రెండు రోజులలో మార్క్ అవుట్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు చేపట్టిన పూర్తి వివరాలను ఇందిరమ్మ ఇండ్ల పురోగతి ఆప్ లో నమోదు చేయాలన్నారు. ఆప్ లో నమోదు చేసే పద్ధతిని కలెక్టర్ స్వయంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అన్ని గ్రామపంచాయతీ లలో గ్రామ కార్యదర్శులతో, మున్సిపాలిటీలలో వార్డ్ ఆఫీసర్ లతో పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నరసింగరావు, హౌజింగ్ పిడి శ్రీనివాస్ రావు, డిపిఒ నగేంద్రం, అన్ని మండలాల ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.




శిక్షణ కార్యక్రమానికి హాజరైన కలెక్టర్ సిక్తా పట్నాయక్

## సకాలంలో సీపీఆర్ చేస్తే
# ప్రాణాలను కాపాడవచ్చు
### నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, అక్టోబరు 16 ప్రభాతవార్త :** జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాలోని అన్ని లైన్ విభాగాల అధికారులు వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎంఎల్‌హెచ్‌పీలకు సీపీఆర్‌పై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అకస్మాత్తుగా గుండెపోటుకు గురైన వ్యక్తుల ప్రాణాలను సకాలంలో సీపీఆర్ ద్వారా కాపాడవచ్చని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈ సీపీఆర్ విధానంపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని ఆమె సూచించారు. కలెక్టరేట్‌లో జరిగిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ మాట్లాడుతూ సీపీఆర్ నేర్చుకోవడం ద్వారా గుండె ఆగిపోయిన వ్యక్తిలో రక్తప్రసరణను తిరిగి ప్రారంభించే అవకాశం లభిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణను ఉపయోగించుకోవాలని ఆరోగ్య సిబ్బందితో పాటు సాధారణ ప్రజలు కూడా సీపీఆర్ నేర్చుకోవాలని ఆమె సూచించారు. ఈ శిక్షణను మహబూబ్ నగర్ నుండి వచ్చిన ఎంఐసియు వైద్యుడు డా. రఘురెడ్డి అందించారు. సీపీఆర్ ప్రక్రియలో అనుసరించాల్సిన ముఖ్యమైన అంశాలను ఆయన వివరించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్యాధికారులు, పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలకు సీపీఆర్ శిక్షణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డా. కే జయచంద్ర, మోహన్, ప్రోగ్రామ్ అధికారి డా. సత్యప్రకాశ్, ఎన్‌సీడి కోఆర్డినేటర్ విజయ్ కుమార్, అరవింద్ కుమార్, అశోక్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



కరివెన రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

## రూ.4.20కోట్లతో
# రోడ్డు పనులకు శ్రీకారం
### పనులను ప్రారంభించిన కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి

**భూత్పూర్, అక్టోబర్ 16,ప్రభాతవార్త :** కరివెన ప్రధాన రహదారిగా పలు గ్రామాలు,తండాలకు ప్రయోజనకారిగా ఉండే కరివెన రోడ్డు పనులను ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి రోడ్డు పనులను ప్రారంభించారు.ఇక్కడి గ్రామాలు,తండావాసుల అవస్థల్ని గుర్తించిన దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల ముధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ఈ రోడ్డు నిర్మాణానికి రు.4కోట్ల 20లక్షల నిధుల్ని మంజూరు చేయించి మూడు నెలల క్రితం శంకుస్థాపన చేశారు.అయితే ఎమ్మెల్యే జీఎంఆర్ ఆదేశాల మేరకు గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి రొడ్డుపనులను ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డి,మండల కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు హరియా నాయక్ తో పాటు ఇతర కాంగ్రెస్ నాయకులు ఆనంద్‌రెడ్డి,దెంది లక్ష్మికాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి,మధుసూధన్‌రెడ్డి,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



బ్రహ్మోత్సవాల గోడపత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే జిఎంఆర్

## బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను
# ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట) అక్టోబరు 16 ప్రభాతవార్త :** పాలమూరు తిరుపతిగా పేరుగాంచిన శ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్స వాలు ఈనెల 22 నుంచి అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి.ఈ నేపథ్యంలో గురువారం దమగ్నాపూర్‌లో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కలిసి బ్రహ్మోత్స వాలకు రావాలని ఆహ్వాన పత్రికను దేవస్థాన చైర్మన్ గోవర్ధన్ రెడ్డి ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి లతోపాటు పాలకమండలి సభ్యులు అందించారు. ఈ బ్రహ్మోత్స వాలకు సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీకురుమూర్తిస్వామి బ్రహ్మోత్స వాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లనుచేపట్టాలని ఆలయ అధికారులు, పాలక మండలిసభ్యులకు సూచించారు.జాతర ఏర్పాట్లపై దేవస్థానం చైర్మ న్, ఈవో లను అడిగి తెలుసుకున్నారు. మంచినీరు, డ్రైనేజీ, మరుగుదొడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పథకాలు లబ్ధిదారులకు చేరాలి

- చెంచుల సర్వతో ముఖాభివృద్ధికి కృషి చేయాలి
- దేశాన్ని క్షయ రహిత దేశంగా తీర్చిదిద్దాలి
- రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- మహబూబ్‌నరగర్ ఐడీవోసీలో ముఖాముఖి
- చెంచుల వైద్యానికి మొబైల్ వాహనం ప్రారంభం
- పాల్గొన్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే యెన్నం, కలెక్టర్, ఎస్పీ




స్నాతకోత్సవం కార్యక్రమంలో గవర్నర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న కలెక్టర్ విజయేంద్రబోయి, చిత్రంలో ఎంపి డీకే.అరుణ, ఎమ్మెల్యే జీఎంఆర్, డిఐజి.ఎల్.ఎస్.చౌహాన్, ఎస్‌పి.డి.జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో,అక్టోబరు 16, ప్రభాతవార్త :** వికసిత్ భారత్ లో భాగంగా జిల్లాలోని ఆదివాసీ చెంచుల సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు చివరి లబ్ధిదారునికి అందాలి భారత దేశాన్ని క్షయ వ్యాధి రహిత దేశంగా తీర్చిదిద్దడంలో సామాజిక ప్రముఖులు,కళాకారులు,రచయితలు, భాగస్వాములు కావాలి రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జిల్లాలో ఉన్న 1441 మంది చెంచుల సమగ్ర, సర్వతోముఖాభివృద్ధికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు చివరి లబ్ధిదారునికి వరకు చేరాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ సూచించారు. గురువారం మహబూబ్ నగర్ జిల్లాలోని పాలమూరు యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్స వం కార్యక్రమానికి హాజరైన అనంతరం రాష్ట్ర గవర్నర్ జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా అధికారులు, వివిధ రంగాల ప్రముఖులతో ముఖాముఖి కార్యక్రమంలో గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యులు డి.కె .అరుణ, స్థానిక శాసన సభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, దేవరకద్ర శాసన సభ్యులు జి. మధుసూదన్ రెడ్డి, గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, డీఐజి. ఎల్.ఎస్. చౌహాన్, ఎస్.పి.డి.జానకిలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా కల్పిస్తున్న ప్రధాన మంత్రి జన్మన్, దర్తి ఆబా అభియాన్ పథకాల ద్వారా, స్వయం ఉపాధి, సౌర విద్యుత్తు,పక్కా ఇండ్లు,విద్య తదితర పథకాలు చెంచులకు అందే విధంగా చూడాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లో క్షయ వ్యాధి ముందస్తు పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్యం అందించాలని, క్షయ రహిత జిల్లా,రాష్ట్రంగా రూపొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమాజంలో ఉన్న మూఢాచారాలు, రుగ్మతలను పారద్రోలడంలో సామాజిక కార్యకర్తలు, ప్రముఖులు,రచయితలు, కవులు,కళాకారులు వీధి నాటకాలు,జానపద గేయాలు,రచనలు, ద్వారా అవగాహన కల్పించి సామాజిక రుగ్మతలను, క్షయ వ్యాధిని రూపుమాపడంలో ప్రముఖులు తమవంతు కృషి చేయాలని సూచించారు.స్వయం సహాయకసంఘాల మహిళలు వినూత్న కార్యక్రమాల ద్వారా చెంచులు,ఆదివాసీ మహిళలను మహిళా సంఘాలలో చేర్చుకుంటూ వారి ఆర్థిక స్వావలంబన అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లా విశిష్టత, ప్రముఖ పర్యాటకస్థలాలు, విద్య, వైద్యం, వివిధశాఖల ద్వారా సాధించిన అభివృద్ధిపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా గవర్నర్‌కు వివరించారు.జిల్లాకు చెందిన విద్య,వైద్యం,క్రీడలు,రచనలు,సేంద్రియ వ్యవసాయం,సామాజిక సేవ వివిధ రంగాలలో 16 మంది ప్రముఖులు తమ తమ రంగాల్లో నిర్వహించిన సేవలను సమావేశంలో వివరించారు తొలుత జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మకు జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి,అదనపు కలెక్టర్‌లు శివేంద్ర ప్రతాప్,మధుసూదన్ నాయక్ స్వాగతం పలికారు. జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పోలీస్ గౌరవ వందనం స్వీకరించారు. విద్యార్థులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు.తర్వాత గవర్నర్ గ్రామీణాభివృద్ధి శాఖ, వైద్య శాఖ, మెప్మా ద్వారా,రెడ్ క్రాస్ సొసైటీ, మహిళా శిశుసంక్షేమశాఖ,తదితర శాఖలు ఏర్పాటుచెంది స్టాళ్లను పరిశీలించారు.ప్రధాన మంత్రి జన్ జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకం కింద చెంచులకు ఆరోగ్య పరీక్షల నిర్వహణకు ఏర్పాటు చేసిన మొబైల్ వైద్య వాహనాన్ని గవర్నర్ జెండా ఊపి ప్రారం భించారు. కార్యక్రమం అనంతరం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మొక్క నాటి నీళ్లు పోశారు. అధికారులతో గ్రూప్ ఫోటోలు దిగారు. జిల్లా అధికారులు , మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## నూతన ఓటర్లకు గుర్తింపు కార్డులు
# తపాలా ద్వారా పంపిణీ




వీడియో కాన్ఫరెన్స్‌లో నాగర్‌కర్నూల్ జిల్లా జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 16 ప్రభాత వార్త:** జిల్లాలో ఓటర్ల వివరాలను సక్రమంగా నవీకరించేందుకు సమగ్ర చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలిపారు. నూతనంగా నమోదు అయిన ఓటర్లకు గుర్తింపు కార్డులను తపాలా శాఖ సహకారంతో పంపిణీ చేసే విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించామని పేర్కొన్నారు. ఈ చర్య ద్వారా ప్రతి ఓటరికి వారి ఓటరు గుర్తింపు కార్డు సురక్షితంగా, సమయానికి అందేలా చూడగలమని తెలిపారు. అలాగే, 100 సంవత్సరాల వయస్సు పైబడిన ఓటర్లను గుర్తించి, వారి వయస్సుకు సంబంధించిన వివరాలను తిరిగి పరిశీలించి, అవసరమైతే సవరించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇందుకోసం సంబంధిత బూత్ స్థాయి అధికారులు మరియు గ్రామ/వార్డు స్థాయి సిబ్బంది సమన్వయంతో సమాచారం సేకరించి, నిజమైన వయస్సు ఆధారంగా ఎన్నికల జాబితాలో మార్పులు చేయనున్నారని వివరించారు. అదేవిధంగా, బూత్ స్థాయి అధికారులకు ఓటరు గుర్తింపు కార్డులు పంపిణీకి సంబంధించిన బాధ్యతలు అప్పగించడంతో పాటు, పెండింగ్‌లో ఉన్న ఓటరు దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి ఓటరికి తగిన గుర్తింపు కార్డు అందించడమే కాకుండా, ఎన్నికల జాబితాలో ఉన్న పొరపాట్లు సవరించేందుకు మరియు పారదర్శకతను కాపాడేందుకు జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీలు పనిచేస్తాయని తెలిపారు.గురువారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ముఖ్య ఎలక్టోరల్ అధికారి కార్యాలయం నుండి ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్రంలోని అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, కలెక్టర్లు, సహాయ ఎన్నికల అధికారులు, తహసిల్దార్లతో రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎలక్ట్రోరల్ అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఓటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరికి తపాలా శాఖ ద్వారా ఓటర్ గుర్తింపు కార్డులను పంపిణీ చేయాలని తెలిపారు. ఓటరు జాబితాలో 100 సంవత్సరాల వయసు కలిగిన ఓటర్లను గుర్తించి వారి వయసును తగిన ఆధారాలతో సమర్పించాలని తెలిపారు. బూత్ స్థాయి అధికారులకు గుర్తింపు కార్డులు పంపిణీ చేయాలని, ఫారం 6, 7, 8 దరఖాస్తులను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో నాగర్ కర్నూల్, కొల్లాపూర్, అచ్చంపేట ఆర్డీవోలు సురేష్ బాబు, మాధవి, బన్సిలాల్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను
# వేగవంతం చేయండి..

- నిజమైన లబ్ధిదారులకే ఇండ్లు మంజూరు చేయాలి
- నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 16 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తి చేయడంలో అధికారులు ప్రధాన బాధ్యత వహించాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. గురువారం ఆయన తెల్కపల్లి మండల కేంద్రంలోని గౌరెడ్డిపల్లి గ్రామంలో ఇందిరమ్మ హౌసింగ్ స్కీం కింద నిర్మిస్తున్న ఇండ్ల నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణ పురోగతిని తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇండ్లు అనేవి పేదల కళల ఇంటి పథకమని, నిజమైన లబ్ధిదారులకే ఇండ్లు మంజూరు చేయాలన్నారు. ఎవరైనా అనర్హులు ఎంపికైతే వారిని జాబితా నుండి వెంటనే తొలగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ పంచాయతీ కార్యదర్శిని గ్రామంలో మొత్తం ఎన్ని ఇండ్లు మంజూరయ్యాయో, వాటిలో ఎన్ని పూర్తయ్యాయో, ఇంకా ఎన్ని -మిగతా4లో..



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

# రేపటి జ్యోతి ప్రదర్శకులు మీరే..

- యూనివర్సిటీ జ్ఞానంతోనే ప్రపంచంలోకి...
- నేర్చుకోవడానికి ప్రవేశించి.. సేవ చేయడానికి బయలుదేరండి..
- రాష్ట్ర గవర్నర్, పాలమూరు యూనివర్సిటీ ఛాన్స్‌లర్ జిష్ణు దేవ్ వర్మ
- పాలమూరు విశ్వవిద్యాలయ స్నాతకోత్సవంలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగం
- 12మందికి పీహెచ్‌డీలు, 83మందికి గోల్డ్‌మెడల్స్ అందజేత
- తిరిగి ఇవ్వడంలోనే నిజమైన విజయం
- ఎంఎస్‌ఎన్ చైర్మన్ డాక్టరేట్ గ్రహీత మన్నే సత్యనారాయణ రెడ్డి




మన్నే సత్యనారాయణ రెడ్డికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేస్తున్న రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ ,వీసీ శ్రీనివాస్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు16,ప్రభాతవార్త :** యూనివర్సిటీలో సంపాదించిన జ్ఞానం, ధైర్యం, వినయం, అంకితభావంతో ప్రపంచంలోకి అడుగుపెట్టాలని,గ్రాడ్యుయేటర్లను సమాజం గొప్ప అంచనాలతో చూస్తుందని, మీరు మానవాళికి సేవ చేయడానికి ఈ గోడలకు అతీతంగా మీరు ఎంచుకున్న రంగాలలో రాణించాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ వర్మ అన్నారు. గురువారం ఆయన పాలమూరు యూనివర్సిటీ నాల్గవ స్నాతకోత్సవ కారక్రమానికి అధ్యక్షత వహించారు. ముందుగా పాలమూరు విశ్వవిద్యాలయంలోని సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియం వద్ద గవర్నర్ పోలీసు గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా గవర్నర్ కు జిల్లా కలెక్టర్ విజయేందిరా బోయి, జిల్లా ఎస్పీ జానకి, అదనపు కలెక్టర్లు పుష్పగుచ్చాలు అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం లైబ్రరీ ఆడిటోరియంలో నిర్వహించిన నాల్గవ స్నాతకోత్సవానికి గవర్నర్ హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఎంఎస్‌ఎన్ గ్రూప్స్ ఆఫ్ కంపెనీస్ చైర్మన్ ఫౌండర్ మేనేజింగ్ డైరెక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డి కి గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు. అలాగే 12 మందికి పీహెచ్ డీ అవార్డులను, 83 మందికి గోల్డ్ మెడల్స్ ఆయన ప్రధానం చేశారు. ఈ సందర్భంగా గవర్నర్, పాలమూరు విశ్వవిద్యాలయం ఛాన్స్ లర్ జిష్ణు దేవ్ వర్మ మాట్లాడుతూ.. పాలమూరు విశ్వవిద్యాలయం నాల్గవ స్నాతకోత్సవం సందర్భంగా ఈరోజు మీ మధ్య ఉండటం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈరోజు కృషి ఫలించిన డాక్టోరల్ స్కాలర్లు, బంగారు పతక విజేతలు, పట్టభద్రులైన విద్యార్థులందరినీ హృదయపూర్వకంగా అభినందించారు. స్నాతకోత్సవం అంటే "సమావేశం" అని అర్థం. ఇది ఒక గంభీరమైన కానీ ఆనందకరమైన వేడుక, ఇది అభ్యాసాన్ని జరుపుకుంటుంది, పట్టుదలను గుర్తిస్తుందనీ, వారి విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్ది మార్గదర్శకత్వం వహించిన ఉపాధ్యాయులను సత్కరిస్తుందని తెలిపారు. మీ విద్య ఇక్కడితో ముగియదు, ఎందుకంటే డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మనకు గుర్తు చేసినట్లుగా, "మనస్సును పెంపొందించుకోవడం మానవ ఉనికి యొక్క అంతిమ లక్ష్యం కావాలి." జీవితాంతం కొనసాగాలన్నారు. "పిల్లలు ఉద్యోగాల కోసం కాదు, మనస్సు యొక్క జీవితాన్ని మొదటిసారి చూడటం కోసమే పాఠశాలకు వెళతారు" అని చెప్పిన అమితవ్ ఘోష్ మాటలను ఈ సందర్భంగా గవర్నర్ గుర్తు చేశారు. భారతదేశ రేపటి జ్యోతి ప్రదర్శకులు మీరే అన్నారు. జ్ఞానార్థ ప్రవేశం ("నేర్చుకోవడానికి ప్రవేశించండి") మరియు సేవార్థ ప్రస్థానం ("సేవ చేయడానికి బయలుదేరండి") అనే గొప్ప సూక్తుల ద్వారా మార్గనిర్దేశం చేయబడుతుంది, ఇవి మీ ముందుకు ప్రయాణాన్ని ప్రకాశవంతం చేస్తాయని చెప్పారు. పాలమూరు విశ్వవిద్యాలయం, కేవలం ఒకటిన్నర దశాబ్దంలోనే, విద్యా మరియు మౌలిక సదుపాయాలలో ప్రశంసనీయమైన పురోగతిని సాధించింది, విశ్వవిద్యాలయాలు నిజంగా ఆధునిక భారతదేశ దేవాలయాలు అని నిరూపించాయని -మిగతా4లో..



మాట్లాడుతున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

## బీసీల బంద్‌కు ఏఐవైఎఫ్ మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కుతుబ్

**అమరచింత అక్టోబర్ 16, ప్రభాత వార్త:** తెలంగాణ రాష్ట్రంలో బీసీ రిజర్వేషన్లు 42 సాధనకై బీసీ జేఏసీ ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బందుకు ఏఐవైఎఫ్ జిల్లా కమిటీ పూర్తి మద్దతు ప్రకటిస్తుందని జిల్లా కార్యదర్శి కుతుబ్ తెలిపారు. గురువారం అమరచింత మండల కేంద్రంలోని ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు రాజ్యాధికారం దిశగా అసెంబ్లీలో తీర్మానం చేసి గవర్నర్, రాష్ట్రపతికి బిల్లు పంపిన ఆమోదించకపోవడం వల్ల కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం బీసీల పట్ల తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఎనిమిది మంది బిజెపి ఎంపీలు తమ వైఖరిని తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బిజెపి ఎంపీలు, ఎమ్మెల్యేలు కేంద్ర ప్రభుత్వంతో బీసీల బిల్లును ఆమోదింప చేయాలని బిజెపి ప్రజా ప్రతినిధులు తమ పదవులకు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీల బందుకు పార్టీలకతీతంగా పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆంజనేయులు మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గార్లపల్లిలో ఇండ్లలోకి చొరబడిన దొంగలు

**ఓ దొంగను పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన గ్రామస్తులు**



**మక్తల్ టౌన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని గార్లపల్లి గ్రామంలో అంజిలప్ప ఇంట్లోకి బుధవారం మధ్య రాత్రి ముగ్గురు దొంగలు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. దొంగతనానికి వచ్చిన వారిలో ఒకరిని గ్రామస్తులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. అడ్డొచ్చిన ఇంటి యజమాని అంజిలప్ప తలపై బలంగా సుత్తితో దొంగలు దాడిచేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మక్తల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం మధ్య రాత్రి సమయం లో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం దాదాపు 12 గంటల ప్రాంతంలో ముగ్గురు యువకులు అంజిలప్ప ఇంటికొచ్చి తలుపులు బాది, బలవంతంగా తలుపులు తెరిచి ఇంట్లో ప్రవేశించి ఇంట్లో ఉన్న మహిళ మెడలో ఉన్న పుస్తెల తాడును లాక్కోవడానికి దొంగలు ప్రయత్నించగా ఇంటి యజమాని అంజిలప్ప వారికి అడ్డు రావడంతో దొంగలు వారి వెంట తెచ్చుకున్న సుత్తితో బలంగా తలపై కొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. భయభ్రాంతులకు గురైన ఆ మహిళ గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్ళు వచ్చి ఆ ముగ్గురిలో ఒక యువకుడిని పట్టుకుని కాళ్లు చేతులు కట్టేసి మక్తల్ పోలీసులకు అప్పగించారు. ఈ మధ్యకాలంలో దొంగతనాలు అధికం అవడంతో దొరికిన దొంగలను విచారించి పోలీసులు నిర్ధారణకు రానున్నారు.

## మండలంలో కొనసాగుతున్న పశువైద్య శిబిరాలు

**ఉప్పునుంతల, అక్టోబరు 16 ప్రభాతవార్త :** పశు సంవర్ధక శాఖ ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని మామిళ్ళపల్లి, అయ్యవారిపల్లి గ్రామాలలో పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశువైద్యాధికారి డా. జి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. మొత్తం 288 గోజాతి, 165 గేదె జాతి పశువులకు టీకాలు వేయడం జరిగిందని పశు వైద్యాధికారి వివరించారు. ఈశిబిరంలో పశువైద్యాధికారి డా.జి.ప్రవీణ్ కుమార్ తో పాటు డా. వి. బుచ్చమ్మ, వెటర్నరీ జూనియర్‌ఆఫీసర్ పొట్టల శ్రీనివాసులు, గోపాల మిత్రులు కొట్టే తిరుపతయ్య యాదవ్, అంజయ్య, శ్రీను, ముజీబ్‌లు పాల్గొన్నారు.


శిబిరంలో పాల్గొన్న పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్

**నేడు లక్ష్మాపూర్, అయ్యవారిపల్లిలో...** పశుసంవర్ధక శాఖ ఉప్పునుంతల వారి ఆధ్వర్యంలో మండలంలో నిర్వహిస్తున్న ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు నేడు శుక్రవారం మండలంలోని లక్ష్మాపూర్, అయ్యవారిపల్లి గ్రామాలలో శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశువైద్యాధికారి డా. జి. ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఈ శిబిరానికి పాడి రైతులు పశువులను శిబిరం వద్దకు తీసుకొచ్చి టీకాలు పశువులకు టీకాలు వేయించుకోవాలని పాడి రైతులకు సూచించారు.

## విద్యా ప్రమాణాలు పెంపొందించాలి

**జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్**

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట) అక్టోబరు 16 ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ సూచించారు. గురువారం మండలంలోని లాల్ కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులకు సైన్స్ పరిజ్ఞానం పెంపొందించేందుకు ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను ఆయన సందర్శించి విద్యార్థులకు అంతరిక్షంపై పలు సూచనలను, సలహాలను అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనాన్ని అందించాలని ఆయన తెలిపారు. బుధవారం మధ్యాహ్న భోజనంలో కప్ప అవశేషాలు రావడంపై తహసిల్దార్ ఎల్లన్న విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనంలో కప్ప కనిపించిందని విద్యార్థులు అనుమానం వ్యక్తం చేశారు. మేము భోజనం చేయలేదని విద్యార్థులు తహసిల్దార్‌కు తెలిపారు. మధ్యాహ్న భోజనాన్ని ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాతే విద్యార్థులకు వడ్డించాలని తహసిల్దార్ తెలిపారు. మధ్యాహ్నం భోజనవిషయంలో ఉపాధ్యాయులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీరి వెంట ఎంఈఓ మురళీకృష్ణ, ఆర్‌ఐలు తిరుపతయ్య, అమీర్, ఉపాధ్యాయ బృందం ఉన్నారు.


విద్యార్థులతో ముచ్చటిస్తున్న డీఈవో ప్రవీణ్ కుమార్

## ముమ్మరంగా కొనసాగుతున్న జాతర పనులు

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట) అక్టోబరు 16 ప్రభాతవార్త :** స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు తరలివచ్చే భక్తులకు ఇబ్బందులు కలవకుండా మంచినీటి వ్యవస్థ, మురుగునీరు వెళ్ళేందుకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మరుగుదొడ్ల నిర్మాణాలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. జాతర మైదానంలో కోనేరు సమీపంలో మురుగు కాలువల పూడికతీత జెసిబిలతో తొలగిస్తున్నారు. మండల కేంద్రం నుంచి జాతరకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే అధికారులు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, పిచ్చి మొక్కలను తొలగించాలని భక్తులు కోరుతున్నారు.


జాతర మైదానంలో కొనసాగుతున్న అండర్ డ్రైనేజీ పనులు

## సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో కార్యక్రమం

**ధన్వాడ, అక్టోబరు 16 ప్రభాతవార్త :** ధన్వాడ మండల పరిధిలోని కొండ్రోనిపల్లి గ్రామంలో బీటీ రోడ్డు పనులు చేపట్టాలంటూ గురువారం సిపిఐ ఆధ్వర్యంలో రోడ్డుపై రాస్తారోకో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి వెంకటేష్ మాట్లాడుతూ గత మూడు నెలల నుండి కొండ్రనిపల్లి గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక ప్రజలు అటు విద్యార్థులు గ్రామస్తుల తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన వివరించారు. పలుసార్లు మండల, జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన పనులు చేపట్టడం లేదని ఆయన విమర్శించారు.. లాల్‌కోట క్రాస్ రోడ్డు నుండి పూసలపాడు కొండ్రనిపల్లి కోటూరు గ్రామాలకు వెళ్లే రహదారి కంకర తేలి గుంతలు ఏర్పడి వాహనదారులు నానా ఇబ్బందులకు గురవుతున్న అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కొండ్రనిపల్లి బీటీ రోడ్డు గుంతలమయం కావడంతో కొండ్రనిపల్లి గ్రామానికి వచ్చే ఆర్టీసీ బస్సు కూడా బంద్ కావడం జరిగిందని ఆయన వివరించారు. అటు మూడు గ్రామాల రైతులకు ప్రజలకు విద్యార్థులకు రాకపోక సౌకర్యాలకు ఇబఅధికారులు స్పందించకపోతే. మూడు గ్రామాల రైతుల ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ రాస్తారోకో కార్యక్రమంలో కొండ్రనిపల్లి గ్రామస్తులు గ్రామం మాజీ సర్పంచ్ నర్సిలు, బాలరాజు, శాంతన్న, అబ్దుల్ హమీద్, మోహన్ రాజు, రామప్ప, పద్మా రెడ్డి, రాజప్ప, తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహిస్తున్న దృశ్యం

# ఎస్సీ వెల్ఫేర్ గురుకులాల్లో 81 ఖాళీ సీట్ల భర్తీ..!

**దరఖాస్తుకు అక్టోబర్ 23 తుది గడువు**

**5 నుండి 9వ తరగతి వరకు ఖాళీలు:**

**టీజీ సీఈటి అర్హులకే మొదటి ప్రాధాన్యత...కలెక్టరేట్‌లోని హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు ;**

**జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి..**

**వనపర్తి,అక్టోబర్ 16, ప్రభాతవార్త:** జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ చేస్తున్నట్లు, అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి నేడొక ప్రకటనలో తెలియజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి బాలురు, బాలికల పాఠశాలల్లో కలిపి మొత్తం 81 సీట్లు ఖాళీగా మిగిలి ఉన్నాయని తెలిపారు. మదనాపురం, వీపనగండ్ల మండలాల్లోని బాలుర పాఠశాలల్లో, అదేవిధంగా బాలికలకు సంబంధించి కొత్తకోట, గోపాల్పేట, పెద్దమందడి మండలాల్లోని పాఠశాలల్లో 5 నుంచి 9వ తరగతి వరకు ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. ఈ మిగిలిన ఖాళీల భర్తీ కోసం టీజీ సీఈటి ప్రవేశ పరీక్షలు అర్హత పొందిన విద్యార్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని, ఆ తర్వాత తదుపరి ఇంకా మిగిలిన ఖాళీలు ఉంటే పరీక్ష రాయనటువంటి విద్యార్థులను డ్రా పద్ధతిలో తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.


జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టర్ (ఫైల్)

కలెక్టరేట్ లోని హెల్ప్ డెస్క్ లో

**దరఖాస్తులు చేసుకోవచ్చు...**

అర్హత గల విద్యార్థులు అక్టోబర్ 23వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు జిల్లా కలెక్టరేట్ (ఐడిఓసి) కార్యాలయంలోని హెల్ప్ డెస్క్ నందు సంప్రదించి ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. దరఖాస్తు తో పాటు సమర్పించాల్సిన

**డాక్యుమెంట్లు...**

దరఖాస్తు చేసుకునే విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, టీజీ సీఈటి సెట్ హాల్ టికెట్ జిరాక్స్ కాపీలను దరఖాస్తు వెంట జతపరిచి ఇవ్వాలని తెలియజేశారు. ప్రవేశాలు పొందిన విద్యార్థులకు ఫోన్ ద్వారా త్వరలో సమాచారం అందజేయడం జరుగుతుందని తెలిపారు.

**మదనపురం, వీపనగండ్ల మండలాల బాలుర సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఖాళీలు ..**

ఐదో తరగతిలో ఎస్సీ కేటగిరి 3, ఎస్టీ 1, బీసీ 2, ఓసీ 2, మైనారిటీ 1 మొత్తం 9 ఖాళీలు ఉన్నాయి. ఆరో తరగతిలో ఎస్సీ కేటగిరి 7, ఎస్టీ 1, బీసీ 1, ఓసీ 2, మైనారిటీ 1 మొత్తం 12 ఖాళీలు ఉన్నాయి. ఏడో తరగతి లో ఎస్సీ కేటగిరి 1, మైనారిటీ 1 మొత్తం 2 ఖాళీలు ఉన్నాయి. 8వ తరగతి లో ఎస్సీ కేటగిరి 7, ఎస్టీ 1, మైనారిటీ 1 మొత్తం 9 ఖాళీలు ఉన్నాయి. 9వ తరగతిలో ఎస్సీ కేటగిరి 9, ఎస్టీ 2, బీసీ 1, ఓసీ 2, మైనారిటీ 1 మొత్తం 15 ఖాళీలు ఉన్నాయి.

**గోపాలపేట, కొత్తకోట, పెద్దమందడి మండలాల బాలికల సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ఖాళీలు**

ఐదో తరగతిలో ఎస్సీ కేటగిరి 4, ఓసీ 1, మైనారిటీ 1 మొత్తం 6 ఖాళీలు ఉన్నాయి. ఆరో తరగతిలో ఎస్సీ కేటగిరి 4, ఎస్టీ 1, ఓసీ 3, మొత్తం 8 ఖాళీలు ఉన్నాయి. ఏడో తరగతి లో ఓసీ 1, మైనారిటీ 1 మొత్తం 2 ఖాళీలు ఉన్నాయి. 8వ తరగతి లో ఎస్సీ కేటగిరి 6, ఎస్టీ 1, బీసీ 4, ఓసీ 2, మైనారిటీ 1 మొత్తం 14 ఖాళీలు ఉన్నాయి. .. 9వ తరగతిలో ఎస్సీ కేటగిరి 2, బీసీ 2, మొత్తం 4 ఖాళీలు ఉన్నాయి.

# ఏఎస్సైల సేవలకు ఎస్పీ అభినందన...

**పోలీసు విధుల్లో నిబద్ధతతో పాటు ఆరోగ్య పరిరక్షణ అవసరం**

**ఏఎస్సైలకు సేవా నిబద్ధత, క్రమశిక్షణ, ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమం**




ఏఎస్ఐల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా ఎస్పీ ఏఎస్ఐలు

**వనపర్తి, అక్టోబరు 16 ప్రభాతవార్త :** గురువారం రోజు వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయం సమావేశం భవనంలో జిల్లా ఎస్పి రావుల గిరిధర్ జిల్లాలోని అన్ని పోలీస్టేషన్ల ఏఎస్సైలకు ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించి. ఈ శిక్షణలో ఏఎస్సైలు విధుల్లో సమర్థత, న్యాయపరమైన దృక్పథం, ప్రజా సేవలో బాధ్యతలపై విస్తృతంగా అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏఎస్సైలు పోలీసు వ్యవస్థలో కీలక స్తంభాలు. మీ నిబద్ధత సమయపాలన, నిజాయితీ పోలీస్ స్టేషన్ సమర్థతను నిర్ణయిస్తాయని ప్రజలతో మృదువుగా, పారదర్శకంగా వ్యవహరించి న్యాయ విశ్వాసాన్ని మరింత బలపరిచి కేసుల దర్యాప్తులో వేగం, నిష్పాక్షికత, సాక్ష్యాధారాల ఆధారిత దృష్టి ఉంచి ఏఎస్ఐ క్రైమ్ రిజిస్టర్, ఎఫ్ఐఆర్‌లు, పంచనామాలు, సాక్షుల విచారణ వంటి బాధ్యతలను సమర్థంగా నిర్వహించి స్టేషన్ పరిపాలనలో ఎస్సైకి సహకరించి, శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలతో సమన్వయాన్ని పెంపొందించుకొని కఠినమైన కేసులను సవాలుగా స్వీకరించి కేసులను పరిష్కరించి ప్రజల భద్రత, న్యాయసేవలో మీరు ఆదర్శంగా నిలవాలని కఠినమైన కేసులను సవాలుగా స్వీకరించి, చాకచక్యంగా పరిష్కరించిన,వారి కృషి, విశ్లేషణా సామర్థ్యం, నిబద్ధత పోలీసు శాఖకు గర్వకారణం,"అని ప్రశంసించారు.అంతేకాదు, ఆరోగ్య పరిరక్షణ కూడా అంతే ముఖ్యం. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటేనే విధుల్లో సమర్థత పెరుగుతుంది. నిత్య వ్యాయామం, సమతుల్య ఆహారం, సానుకూల దృక్పథంతో సేవను కొనసాగించండి అని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి డిఎస్పీ, ఉమామహేశ్వరరావు, డిసిఆర్బి ఎస్సై, తిరుపతిరెడ్డి అన్ని పోలీస్టేషన్ల ఏఎస్సైలు తదితరులు పాల్గొన్నారు.

# వేసవిలో నీటి ఎద్దడి రాకుండా పనులు కొనసాగాలి

**ఆత్మకూర్ అక్టోబర్ 16, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో రానున్న వేసవి కాలంలో నీటి ఎద్దడి లేకుండా పనులు వేగవంతంగా కొనసాగాలని ఆత్మకూరు మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూరు మున్సిపల్ కమిషనర్ శశిధర్ తదితరులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో నూతనంగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగుతున్న అమృత్ పథకాలలో భాగంగా మంచినీటి ట్యాంక్ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో ట్యాంక్ నుండి సరఫరా మరియు విద్యుత్ ఫీడర్ పనులకు సంబంధించి గురువారం రోజు ఆత్మకూరు పట్టణంలో పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టినటువంటి అమృత్ తెలపతకంలో భాగంగా ఆత్మకూరు పట్టణానికి మంజూరైన మంచినీటి ట్యాంకు పనులు పూర్తయిన నేపథ్యంలో పట్టణంలోని ప్రధాన కాలనీలకు మరియు మంచిని సరఫరా కు సంబంధించి ఏర్పాటు చేసిన పైప్ లైన్ పనులను విద్యుత్ ఫీడర్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి రాబోయే వేసవికాలంలో ఎలాంటి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ మాజీ అధ్యక్షులు తులసిరాజు యాదవ్ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నలగొండ శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గణేష్ తదితరులతో పాటుగా పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు....


పనులను ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా

# ప్రీమెట్రిక్ హాస్టళ్లలో కొత్త మెనూను ఆవిష్కరించిన కలెక్టర్

**గద్వాలటౌన్,అక్టోబర్16, ప్రభాతవార్త:** 2025.26 విద్యాసం వత్సరానికి గాను ఎస్సీ,ఎస్టీ, బీసీ ఫ్రీ మెట్రిక్ హాస్టళ్లలో కలెక్టర్ బి యం సంతోష్ కొత్తమెనూ ఆవిష్కరించారు.గురువారం ఐడీఓసీ తమ ఛాంబర్ నందు ఎస్.సి., ఎస్.టి., బి.సి. ప్రీమెట్రిక్ హాస్టళ్లలో 2025 26 మెనూ వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఎస్.సి., ఎస్.టి., బి.సి. ప్రీ మెట్రిక్ హాస్టళ్లలో 2025-26 విద్యా సంవత్సరానికి కొత్త,పోషకాహార మెనూ అమలులోకి వచ్చిందని తెలిపారు. మంచి ఆహారం,మంచి ఆరోగ్యం,మంచి విద్య - ఈ మూడు ఒకదానికొకటి విడదీయరాని అంశాలు అని,విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి నాణ్యమైన ఆహారం అందించడం ప్రభుత్వ అత్యంత ప్రాధాన్య లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పడే విధంగా నిత్య ఆహారంలో పోషక పదార్థాలు ఉండేలా కొత్త మెనూను రూపొందించామని తెలిపారు. పిల్లల శ్రేయస్సు దృష్ట్యా ఆహారంలో నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, వంటశాలల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని,ఆహారంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకూడదని సూచించారు.ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ అధికారి అక్బర్ పాషా,ఈ.డి ఎస్సీ కార్పొరేషన్ నుషిత,హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ సంతోష్, వెల్ఫర్ అధికారులు

## శ్రీ శ్రీ రంగనాయక స్వామి వారిని దర్శించుకున్న పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి

**శ్రీరంగాపూర్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** శ్రీరంగాపురం మండలంలోని శ్రీ శ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్ని పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి వి. నారాయణస్వామి గురువారం రోజు సందర్శించగా వారికి ఆలయ అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు.వి.నారాయణస్వామి మాట్లాడుతూ శ్రీ శ్రీ రంగనాయక స్వామి దేవాలయాన్ని సందర్శించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఆలయంలోని చిత్రాలు పరిసరాలను పరిశీలించి ఆలయ చరిత్రను గురించి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ యాదవ్, శ్రీరంగాపూర్, పెబ్బేరు మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారిని దర్శించుకున్న పుదుచ్చేరి మాజీ ముఖ్యమంత్రి





## నేడు మక్తల్‌కు మంత్రుల రాక

**పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న మంత్రులు**

**వాకిటి శ్రీహరి,దామోదర రాజనర్సింహ**

**మక్తల్ టౌన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో మినీ ట్యాంక్ బండ్ ఆధునీకరణ, చేప పిల్లల పంపిణీ పలు అభివృద్ధి పనుల కొరకు జిల్లా ఇంఛార్జ్ మంత్రి రాజనర్సింహ రానున్నారు. మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో జరగబోవు పలు అభివృద్ధి పనులను మాజీ ఉపసర్పంచ్ మంత్రి సోదరుడు మాజీ ఉపసర్పంచ్ వాకిటి శేషగిరి, మున్సిపాలిటీ కమిషనర్ శ్రీరాములు, ఏఈ నాగ శివ, మాజీ ఫిషరీస్ చైర్మన్ కోళ్ల వెంకటేషులు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, శాలంబిన్ ఓమర్, వాకిటి ఆంజనేయులు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపిటిసి లక్ష్మణ్, వాకిటి శ్యామ్, కిష్టప్ప, వాకిటి వెంకటేష్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కీ.శే పటేల్ రామచందర్ రెడ్డి ప్రథమ వర్ధంతికి హాజరైన ఎమ్మెల్యే


పూలమాల వేసే నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

**మల్దకల్ అక్టోబర్ 16, ప్రభాతవార్త :** మల్దకల్ మండలం పరిధిలోని కుర్తిరావులచెరువు గ్రామానికి చెందిన జిల్లా సీనియర్ నాయకులు పటేల్ ప్రభాకర్ రెడ్డి కుమారుడు కీర్తిశేషులు రామచందర్ రెడ్డి ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి పూలు వేసి నివాళులర్పించి తన ఆత్మ శాంతి కలగాలని భగవంతుని మన స్ఫూర్తిగా ప్రార్థించారు. ఎమ్మెల్యే వెంట జిల్లా సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి మాజీ ఎంపీపీ విజయ్, నాయకులు చంద్రశేఖర్ రమేష్ రెడ్డి, శేషురెడ్డి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌జిఎఫ్ క్రీడల్లో ఆత్మకూరు విద్యార్థి


ఎంపికైన విద్యార్థి అరవింద్ కుమార్ ను సన్మానిస్తున్న దృశ్యం

**ఆత్మకూర్ అక్టోబర్ 16, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన వనపర్తి పట్టణంలో జరుగుతున్న ఎస్ జి ఎఫ్ క్రీడల్లో భాగంగా కరాటే విభాగంలో ఆత్మకూరు పట్టణానికి చెందిన అరవింద్ ఉమ్మడి జిల్లా కరాటే పోటీలకు ఎంపికైనట్లుగా ఆత్మకూర్ కరాటే నిర్వాహకులు నరేందర్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నటువంటి ఎస్జీఎఫ్ క్రీడల్లో భాగంగా అండర్ 17 విభాగంలో ఆత్మకూర్ పట్టణానికి చెందిన అరవింద్ 75 కేజీల విభాగానికి సంబంధించి కరాటే పోటీలో అద్భుత ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి జిల్లా కరాటే పోటీలకు ఎంపిక చేశారని ఆయన తెలిపారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాకు ఎంపికైన ఆత్మకూరు విద్యార్థి అరవింద్ కుమార్ ను పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు ప్రత్యేకంగా అభినందించారు.

## ఘనంగా వనమహోత్సవం కార్యక్రమం


మహోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

**మక్తల్ టౌన్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** మక్తల్ పట్టణంలో 1వ వార్డు శివాజీనగర్, లింగోజీ కోట యందు వంద రోజుల ప్రణాళికలో భాగంగా వనమహోత్సవం (మొక్కల పంపిణి) కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ మహేశ్వరి, ఇందిరమ్మ వార్డ్ కమిటీ సభ్యులు మొహమ్మద్ ఫయాజ్, పాండు, కోళ్ల అశోక్ , వార్డ్ ఆడపడుచులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జోనల్ టోర్నమెంట్‌కు నాగర్ కర్నూల్ జిల్లా వాసి ఎంపిక

**ఉప్పునుంతల, అక్టోబరు 16 ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లా జోనల్ టోర్నమెంట్‌కు నాగర్ కర్నూల్ జిల్లా నుంచి అఖిల్ కు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్‌లు తెలిపారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు లో జరిగే అండర్ 14 కబడ్డీ రాష్ట్రస్థాయిలో జరిగే కబడ్డీ పోటీలకు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్టూరుకు అఖిల్ ఎంపిక కావడం పట్ల వెల్టూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం ఆంజనేయులు, వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్, ఉపాధ్యాయ బృందం విద్యార్థి అఖిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



**మద్దూరు, అక్టోబరు 16 ప్రభాతవార్త :** మద్దూరు పట్టణ కేంద్రంలోని సంఘం చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. మెదక్ జిల్లాకు చెందిన శేఖర్(42) సంవత్సరన్నర క్రితం కుటుంబంతో కలిసి మద్దూరుకు వచ్చి ఓ స్క్రాప్ షాప్‌లో పనిచేసేవాడు. శనివారం తెల్లవారుజామున కాలకృత్యాల కొరకై చెరువుకు వెళ్లగా ఫిట్స్ రావటంతో (మూర్ఛ వ్యాధి) చెరువులో పడి చనిపోయాడు. ఈయనకు భార్య లక్ష్మి మ్మతో పాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మరిన్ని విషయాలు పోలీసుల విచారణలో తేలే అవకాశం ఉంది.

## రేపటి జ్యోతి ప్రదర్శకులు మీరే..

**మొదటి పేజీ తరువాయి భాగం..**



మాట్లాడుతున్న వీసీ శ్రీనివాస్

పేర్కొన్నారు. విశ్వవిద్యాలయం యొక్క కమ్యూనిటీ ఔట్రీచ్ కార్య క్రమాలు మిలియన్ ట్రీ ప్లాంటేషన్ డ్రైవ్, విలేజ్ అడాప్షన్ మరియుకనెక్ట్ ఛాన్సలర్ విద్యను ఆచరణలో చూపిస్తాయన్నారు. పీఎం ఉషా పథకం కింద రూ.100.00 కోట్లు పొందినందుకు పాలమూరు విశ్వ విద్యాలయాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. తెలంగాణ ఉన్నత విద్యా రంగంలో అగ్రగామిగా నిలిచే విజయం అని అన్నారు. న్యాక్ అక్రిడిటేషన్ యొక్క రెండవ చక్రం పూర్తి కావడం కూడా అంతే ముఖ్యమైనది, ఇది వైస్‌ఛాన్సలర్, అధ్యాపకులు మరియు విద్యార్థుల ఉమ్మడి నిబద్ధతను ప్రతిబింబి స్తుందన్నారు. ఉన్నత విద్య అనేది సామాజిక పరివర్తనకుఇంజిన్. ఇది మనల్ని చీకటి నుండి వెలుగులోకి నడిపిస్తుంది.."జ్ఞానం మాత్రమే విముక్తినిస్తుంది అని ప్రకటిస్తుంది అని "జ్ఞానం ద్వారా బలాన్ని పొందుతాడు" అని ధృవీకరిస్తుంది. మన విశ్వవిద్యాలయాలుఎల్లప్పుడూ అప్ర మత్తంగా, మనయువతహృదయాలలోతెలివితేటలను మాత్రమే కాకుండాస్థితి స్థాపకతను కూడా పెంపొందిస్తుందన్నారు. 21వ శతాబ్దపుఈ జ్ఞానయుగంలో, విశ్వవిద్యాలయాలు తమ లక్ష్యాన్ని పునర్నిర్వచించుకోవాలి, ఆవిష్కరణలను స్వీకరించాలన్నారు.

## నాలో ధృడ సంకల్పాన్ని నింపింది ఈ నేల

- ఈరోజు మీతో ఉండడం అపారమైన గౌరవం, ఆనందం
- మహబూబ్‌నగర్ జ్ఞానం అవకశాలకు కేంద్రంగా మారాలి
- తిరిగి ఇవ్వడంలోనే నిజమైన విజయం
- ఎంఎస్ఎన్ ఛైర్మన్ మన్నే సత్యనారాయణ రెడ్డి



ఎంఎస్ఎన్ గ్రూప్ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్, వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ డైరెక్టర్ మన్నే సత్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ ఈరోజు మీతో ఉండటం నాకు అపారమైన ఆనందాన్ని మరియు లోతైన గౌరవాన్ని ఇస్తుంది. ఒక విశ్వవిద్యాలయం యొక్క విద్యా జీవితంలో అత్యంత పవిత్రమైన సందర్భాలలో ఒక స్నాతకో త్స వం ఒకటి. ఇది విద్యార్థుల విజయాలకు మాత్రమే కాకుండా, వారిని మార్గనిర్దేశం చేసి, పెంచి పోషించిన ఉపాధ్యాయులు, మార్గదర్శకులు మరియు కుటుంబాల అవిశ్రాంత అంకితభావానికి కూడా ఒక వేడుక అని తెలిపారు. పాలమూరు విశ్వవిద్యాలయం యొక్క నాల్గవ స్నాతకోత్స వం సందర్భంగా ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్‌గా మాత్రమే కాకుండా ఈ నేల పుత్రుడిగా కూడా. చారిత్రాత్మకంగా పాలమూరు అని పిలువబడే మహబూబ్‌నగర్ నా ప్రయాణాన్ని, విలువలను తీర్చిదిద్ది, నాలో కృషి, స్థితిస్థాపకత మరియు ధృఢ సంకల్పాన్ని నింపింది. ఒకప్పుడు వలసలకు ప్రసిద్ధి చెందిన ఈ భూమి ఇప్పుడు విద్య, ఆరోగ్య సంరక్షణ మరియు పరిశ్రమలలో పురోగతికి గుర్తింపు పొందుతోంది. పాలమూరు విశ్వవిద్యాలయం ఈ పరివర్తనకు చిహ్నంగా నిలుస్తుంది, ప్రతిభను పెంపొందిస్తుంది మరియు యువత భవిష్యత్తులోకి ఆత్మవిశ్వాసంతో అడుగు పెట్టడానికి శక్తినిస్తుంది అని తెలిపారు. ఈ జిల్లా నుండి వచ్చిన వ్యక్తిగా, దాని అభివృద్ధికి తోడ్పడటం గౌరవం బాధ్యత రెండూ. పాలమూరు భవిష్యత్తు నేడు పట్టభద్రులవుతున్న యువ గ్రాడ్యుయేట్ల చేతుల్లో ఉందని నేనుగట్టిగా నమ్ముతున్నాను. విద్య, నైపుణ్యాలు మరియు ఆవిష్క రణలతో, మీరు మీ స్వంత జీవితాలను మాత్రమే కాకుండా ఈ ప్రాంతం యొక్క విధిని కూడా రూపొందించే శక్తిని కలిగి ఉన్నారు. మహబూబ్‌నగర్ జ్ఞానం, అవకాశాలు మరియు శ్రేష్ఠతకు కేంద్రంగా ఎదగాలని నా కల, ఇక్కడ మన యువత తమ సంస్కృతిలో లోతుగా పాతుకుపోయి ప్రపంచ శిఖరాలను సాధించగలరనీ ఆశా భావం వ్యక్తం చేశారు. ఇది మీ క్షణం, మీ కృషి, పట్టు దల మరియు స్థితిస్థాపకతకు పరాకాష్ట. మీరు ఈ పోర్టల్స్ నుండి బయటకు అడుగు పెట్టినప్పుడు, మీరు కేవలం డిగ్రీలను మోసుకెళ్లరు; మీరు కలలు, ఆకాంక్షలు మరియు బాధ్యతలను మోసు కెళ్లారు. మీ జ్ఞానం, విలువలు మరియు ధైర్యాన్ని పరీక్షించడానికి ప్రపంచం మీ కోసం ఓపెన్ చేతులతో ఎదురుచూస్తోందని చెప్పారు. కానీ విజయం ఎప్పుడూ వ్యక్తిగత విజయాల ద్వారా మాత్రమే కొలవబడదని గుర్తుంచుకోండి. నిజమైన విజయం తిరిగి ఇవ్వడంలో ఉందన్నారు. మీ తల్లిదండ్రులను గర్వపడేలా చేయడం, మీఅల్మాను గౌరవించడం. సమాజం మరియు దేశం యొక్కపురోగతికి తల్లి,మరియు దోహదపడటం. మీలో ప్రతిఒక్కరూ పాలమూరు విశ్వ విద్యా లయానికి రాయబారులు. జీవితం మిమ్మల్ని ఎక్కడికి తీసుకెళుతుందో, దాని పేరును గౌరవం, సమగ్రత మరియుగర్వంతో తీసుకెళ్లాలని ఆయనసూచించారు. పాలమూరు విశ్వవిద్యాలయం యొక్క అద్భుతమైన పురోగతిని చూడటంనాకు చాలా ఆనందంగా ఉంది. దాని అనుబంధ కళా శాలలలో దాదాపు 40,000 మంది విద్యార్థులతో, ఇది ఈ ప్రాంత విద్యా హృదయ స్పందనగా మారింది. దాని ప్రధాన క్యాంపస్ మరియు మూడు జిల్లా పీజీ కేంద్రాలలో, విశ్వవిద్యాలయం ఇప్పుడు 24 విద్యా కార్యక్రమాలను అందిస్తోందన్నారు. తెలంగాణలో ఉన్నత విద్యను సుసంపన్నం చేస్తోంది, దాని యువత ఆకాంక్షలను తీరుస్తోందన్నారు. విశ్వవిద్యాలయం యొక్క ఇంజనీరింగ్ మరియు లా కాలేజీల స్థాపన, ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా బి.ఫార్మసీ ప్రోగ్రామ్ గుర్తింపు, నేషనల్ కౌన్సిల్ఫర్‌టీచర్ ఎడ్యుకేషన్ ద్వారా ఎం.ఎడ్. ప్రోగ్రామ్ ఆమోదం, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ద్వారా లా కోర్సుల గుర్తింపు, ఇంజనీరింగ్ ప్రోగ్రామ్ ఆమోదం వంటి ఇటీవలి మైలురాళ్లకు నేను అభినందిస్తున్నాను అని అన్నారు. ఈ విజయాలు సాధించిన పురోగతినిమాత్రమేకాకుండా, ఉజ్వలభవిష్యత్తు యొక్క వాగ్దానాన్ని కూడా ప్రతిబింబిస్తాయన్నారు.

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిసిన ఎమ్మెల్యే

**దేవరకద్ర, అక్టోబరు 16 ప్రభాతవార్త:** తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం పాలమూరు జిల్లా అధికారుల సమీక్ష సమావేశంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిసి, పూల బొకే, శాలువతో ఘనంగా సన్మానించి సాదర స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఆర్గనైజేషన్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలి

**బిజినేపల్లి, అక్టోబరు16 ప్రభాతవార్త:** మొక్కలు నాటి ప్రతి ఒక్కరు కూడా ప్రకృతికి తోడ్పాటు కావాలని, నాటిన ప్రతి మొక్కను విరివిరిగా పెంచే విధంగా సామాజిక బాధ్యతగా గ్రామస్తులు తండావాసులు తీసుకోవాలని ఎంపీడీవో కతలప్ప ఆయన సూచించారు. గిరిజన తండాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా చిన్నపిరు తాండ గ్రామపంచాయతీ కి ఇరువైపులా రోడ్డుకు ఆవెన్యూ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. సబ్ స్టేషన్ బీటీ రోడ్డు నుండి కాత్రావత్‌తాండ వరకు రోడ్డు ఇరువైపులా మొక్కలు నాటాలని సూచించారు. ముఖ్యంగా ఆక్సిజన్ అధిక మొత్తంలో విడుదల చేసే మొక్కలు, ప్రకృతికి కాపాడుటకు ఫలాలు ఇచ్చే మొక్కలు నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు చిన్నయ్య, అశోక్, మండల నాయకులు గోవిందునాయక్, శ్రీను, రాజగోపాల్, పాండు దీపక్ చంద్రు, మాజీ సర్పంచ్ సాలెమ్మ, మునీందర్ శాంతి, బాలు, మనీ, జెమిని తండావాసులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా స్థాయి చదరంగం పోటీలు విజయవంతం

**నారాయణపేట టౌన్, అక్టోబరు16 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో 69వ ఎస్జిఎఫ్ క్రీడల్లో భాగంగా నారాయణపేట జిల్లా స్థాయి అండర్ 14, అండర్ 17 బాలబాలికల చదరంగ పోటీలు జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లాలోని ప్రభుత్వ ప్రయివేటు పాఠశాలల నుండి సుమారు 120మంది విద్యా ర్థులు పాల్గొన్నారు. అండర్ 14, అండర్ 17 బాల బాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహిం చారు. దీనిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అండర్ 14 బాలికల విభాగం నుండి 5 గురు, బాలుర విభాగం నుండి 5 గురు, అండర్ 17లో బాలికల నుండి 5గురు, బాలుర నుండి 5 గురు సెలెక్ట్ అయ్యారని వీరు ఈనెల 18న వనపర్తి లో జరిగే ఉమ్మడి మహబూబ్ నగర్ స్థాయి పోటీలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలు ప్రభుత్వ అభ్యసన ఉన్నత పాఠశాల ఉపా ధ్యాయులు మోహన్ పర్యవేక్షణలో జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎస్జిఎఫ్ మాజీ సెక్రెటరీ నర్సి ములు, పిడిలు రత్నయ్య, బాలరాజ్, వెంకటేష్, రామకృష్ణ రెడ్డి, అక్తర్, పర్వీన్, అనంత సేన, కతలప్ప, కృష్ణవేణి, పిఈటిలు బసంత్ రెడ్డి, రాజేష్, చక్రి పాల్గొన్నారు.

## పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టికా వేయించాలి

**లింగాల, అక్టోబరు16 ప్రభాతవార్త:** లింగాల మండలంలోని పాడి రైతులు తమ పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టికా వేయించాలని లింగాల పశువైద్యాధికారి ప్రియాంక అన్నారు. గురు వారం లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలోని పాడి రైతుల పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టికా వేశారు. పాడి యాజమానులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టికాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు. వర్షాలు బాగా కురవడం వల్ల పశువులు గాలికుంటు వ్యాధుల బారిన పడతాయని తెలిపారు. గాలికుంటు వ్యాధి నివారణ టికాలు అక్టోబర్ 15 నుంచి నవంబర్ 14 వరకు మండలంలోని ఆయా గ్రామాల్లో పశువులకు టికాలు వేయడం జరుగుతుందని, పాడి రైతులు తప్పనిసరిగా గాలికుంటు నివారణ టికా వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు పాల్గొన్నారు.

## భూత్పూర్‌లో కొనసాగుతున్న పశువైద్య శిబిరాలు

**- రెండో రోజు 300 పశువులకు టీకాలు**

**భూత్పూర్, అక్టోబర్16, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలంలో పశువైద్య శిబిరాలు కొనసాగుతు న్నాయి. పశువైద్య శిబిరాలు ఈ నెల 15 నుంచి నెల రోజుల పాటు జరుగనున్నాయి. తొలి రోజు 277పశువులకు టీకాలు వేయగా, రెండో రోజు గురువారం భూత్పూర్ మండలం లోని వివిధ గ్రామాల సెంటర్లలో 399పశువులకు టీకాలు వేసినట్లు మండల పశువైద్యాధికారి డాక్టర్ మధు సూధన్ తెలిపారు. పశువులలో తరచూ సోకే గాలికుంటు వ్యాధుల నివారణ కోసం భూత్పూర్ మండలంలో నెల రోజుల పాటు వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ మధుసూధన్ తెలిపారు. రైతులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ మధుసూధన్ కోరారు.

# ఏకాభిప్రాయంతోనే డిసిసి అధ్యక్షుడి ఎన్నిక

- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి
- అభిప్రాయాలను సేకరించి ఏఐసీసీకి నివేదిక అందిస్తాం: ఏఐసిసి అబ్జర్వర్లు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి



జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎమ్మెల్యే జిఎంఆర్ అప్లికేషన్ అందజేస్తున్న దృశ్యం

**దేవరకద్ర, అక్టోబరు16 ప్రభాతవార్త:** పార్టీ అధిష్టానం అది నాయ కత్వం జిఎంఆర్ సేవలను గుర్తించి, మరోసారి జిల్లా అధ్యక్ష బాధ్య తను జిఎంఆర్‌కి అప్పగించాలని, దేవరకద్ర నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు, మళ్లీ జిఎంఆర్‌కే అధ్యక్ష పదవిని కొనసాగించాలని పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ, ముక్తకంఠంతో మద్దతు తెలిపారు. ఏకాభిప్రాయంతోనే డిసిసి అధ్యక్షుడు ఎన్నిక జరుగుతుందని పాలమూరు కాంగ్రెస్ పార్టీ డిసిసి అధ్యక్షులు, దేవరకద్ర శాసనసభ్యులు మధుసూదన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసే దిశగా డిసిసి అధ్యక్షుల నియామక ప్రక్రియ పూర్తి చేసేదిశగా సంఘటన్ సృజన అభియాన్ కార్యక్రమం దేవరకద్ర మండల కేంద్రంలోని శ్రీనివాస్ గార్డెన్‌లో దేవరకద్ర, కౌకుంట్ల, చిన్నచింతకుంట, మండలాల సమన్వయ కమిటీ సమావేశం దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి అధ్యక్షత నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఏఐసిసి అబ్జర్వర్లు కర్ణాటక ఎమ్మెల్సీ నారాయణస్వామి, ఫిషరీస్ కార్పొ రేషన్ ఛైర్మన్ మెట్టు సాయి, టీపీసీసీ అబ్జర్వర్లు ఉజ్మా షాకీర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏఐసీసీ, టీపీసీసీ, అబ్జర్వర్లు మాట్లాడుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడు ఎంపిక కోసం అభిప్రాయాలు సేకరించేందుకు ఈ సమావేశానికి రావడం జరిగిం దన్నారు. నాయకులు, కార్యకర్తల, అభిప్రాయాలను సేకరించి ఈనెల 22న ఏఐసీసీకి నివేదిక అందిస్తామన్నారు. మెజార్టీ అభిప్రాయం మేరకు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని జిల్లా అధ్యక్షుడు ఎంపికపై ఏఐసీసీ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు. అనంతరం మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు, ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ జిల్లా అధ్యక్షుడు ఎంపిక పూర్తి పారదర్శకంగా అందరి అభిప్రాయం మేరకు అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని ఏఐసీసీ డిసిసి అధ్యక్షుడు నియామకంపై తుది నిర్ణయం తీసుకుంటుందని తెలియజేశారు. అదేవిధంగా రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీ లు అమలు చేస్తూ, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై కాంగ్రెస్ కట్టుబడి ఉందని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి తెలిపారు. తదనంతరం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి ఎమ్మెల్యే జిఎంఆర్ అప్లికేషన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ స్వర్ణ సుధాకర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్ కుమార్ రెడ్డి, మండల అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ ఛైర్మన్ కథలప్ప, కురుమూర్తి ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఫారుక్ అలీ, అంజన్ కుమార్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, గుడిబండ గౌని అమరేశ్వర్ రెడ్డి, కౌకుంట్ల యువజన అధ్యక్షులు నరేష్, ఓబీసీ అధ్యక్షులు ఆంజనేయులు, పుట్టపల్లి చెన్నకేశవులు, శేఖర్, ముచ్చింతల వెంకటేశ్వర్ రెడ్డి, గోపన్ పల్లి సురేందర్ రెడ్డి, రాంబాబు, గోపన్ పల్లి మాజీ సర్పంచ్, చిన్న చింతకుంట ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



మళ్లీ డిసిసి అధ్యక్షుడు జిఎంఆర్ కావాలని నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

# విచారణ పేరుతో జీతం చెల్లింపు కాలయాపన తగదు

- ఆసుపత్రి కార్మికులు పస్తులు ఉండకుండా వేతనం చెల్లించాలి
- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్
- జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి ఏఐటియుసి వినతి
- ఇంఛార్జ్ సూపరింటెండెంట్ సమక్షంలో ఏజెన్సీ యూనియన్ నాయకుల చర్చలు
- వేతనం చెల్లించాలని ఏజెన్సీ నిర్వాహకులకు డాక్టర్ రంగారావు ఆదేశం



కలెక్టర్ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న కార్మిక నాయకులు



యూనియన్ నాయకులతో కార్మికుల చర్చలు

**వనపర్తి, అక్టోబరు 16 ప్రభాతవార్త:** వనపర్తి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పారిశుద్ధ సెక్యూరిటీ పేషెంట్ కేర్‌సూపర్‌వైజర్ కార్మికుల వేతన చెల్లింపు విచారణ పేరుతో జాప్యం సరికాదని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. గురువారం తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్‌యూనియన్ (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో పెండిం గ్ వేతనం చెల్లించాలని కోరుతూ వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగారావు సమక్షంలో కార్మికుల పెండింగ్ వేతనం, కార్మికుల ఇతర ముఖ్యమైన సమస్యలపై ఏజెన్సీ నిర్వాహకులు శ్రీకాంత్‌రెడ్డి, ఏఐటీయూసీ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ కార్మికులతో కలిసి చర్చలు జరిపారు. దీపావళికి కార్మికుల ఇబ్బందులు పడ కుండా వేతనాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్మికుల సమావేశంలో పి.సురేష్ మాట్లాడుతూ: ప్రభు త్వ జనరల్ ఆసుపత్రి 500 పైగా పడకల సామర్థ్యానికి కేవలం 330 పడకలకు మాత్రమే 143 కాంట్రాక్ట్ కార్మికుల సేవలందిస్తూ అదనపు పని భారానికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విచారణ జరిగిన ప్రతిసారి కార్మికుల వేతనాల చెల్లింపుల్లో తీవ్రమైన జాప్యం జరుగుతుందని దీనితో కార్మికులు ఇబ్బందులు ఎదు ర్కొంటున్నారని అన్నారు. విచారణ పేరుతో దసరాపండుగకి కార్మికులకు వేతనాలు అందలేదని యూనియన్ నేతల కార్మికుల ఒత్తిడితో సూపరిండెంట్ డా.రంగారావు ఆదేశాలతో ఏజెన్సీ నిర్వా హకులు కార్మికునికి రూ.4000ల అడ్వాన్సులు చెల్లించారని అన్నారు. ఇదే నెలలోనే దీపావళి పండుగ సమీపిస్తున్న జీతాల చెల్లింపులో క్లారిటీ లేదని అన్నారు. ఇప్పటికే అధికారులకు అనేక సార్లు విన్నవించడం జరిగిందని అన్నారు. దీపావళికైన కార్మికులకు ఇబ్బందులు పడకుండా తక్షణమే వేతనం అందించాలని లేనిచో మెరుపు సమ్మెకు దిగుతామని అన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఆసుపత్రి బ్రాంచ్ నేతలు కార్మికులు గంధంశీను, నరసింహ, నరేందర్, మోహన్, పవన్, రాము, దర్గాస్వామి, కుమార్, రాజశేఖర్, జలాల్, షాబాద్, అనిల్, శివ, వెంకటయ్య, శ్రీకాంత్, లక్ష్మమ్మ, కళావతి, ఇందిరా, భాగ్యలక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

# రోడ్ల మరమ్మతులకు భారీగా నిధులు విడుదల

**రహదారుల అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి : కాంగ్రస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్**




మాట్లాడుతున్న నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్

**నర్వ, అక్టోబరు16 ప్రభాతవార్త:** నియోజకవర్గం రహదారుల అభి వృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మండలం వ్యాప్తంగా దెబ్బతిన్న రోడ్ల మరమ్మతుల కోసం ఏకంగా రూ.35 లక్షల భారీ నిధులను మంజూరు చేసింది. ఈ మేరకు నిధులకు పాలనాపరమైన అనుమతులు వచ్చినట్లు కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు బీసం చెన్నయ్య సాగర్ తెలిపారు. ఈ నిధుల తో మండలం లోని మొత్తం 11 రహదారులను బాగుచేయ నున్నారు. మంజూరైన నిధులను మండలంలోని ఆయా గ్రామాల వారిగా రహదారుల పనులకు వేర్వేరుగా కేటాయించారు. మండ లంలో 11 రహదారుల మరమ్మతుల కోసం రూ.35 లక్షలు కేటా యించినట్లు ప్రభుత్వ ఉత్తర్వులు వచ్చాయని, త్వరలోనే పనులను ప్రారంభించి మరమ్మత్తు పనులను ప్రారంభించడం జరుతుందని పేర్కొన్నారు. రాయికోడ్ కాత్రేవుపల్లి 3.3 లక్షలు, లంకాల నుంచి ఉంద్యాల 4.2లక్షలు, కొత్తపల్లి నుంచిపెద్ద కదుమూరు 2.4 లక్షలు, రాంపూర్ నుంచి ఉందేకోడు 3.6లక్షలు, కల్వాల్ నుంచి కర్నే3.6లక్షలు, కల్వాల్ నుంచి ముసలాయపల్లి 2.4 లక్షలు, నాగిరెడ్డిపల్లి నుంచి నంద్యాల1.98 లక్షలు, చిత్తనూరు గేట్ నుంచి ఉందెకోడ్ 3.6 లక్షలు, యాంకి నుంచి బెక్కరపల్లి 1.8 లక్షలు, జక్కన్నపల్లి నుంచి సిపూర్ 3.6 లక్షలు, శ్రీపూర్ నుంచి పెద్దకడు మూరు 3.9 లక్షల రూపాయల మంజూరు కావడం జరిగిందని పేర్కొన్నారు. మంత్రి వాకిటి శ్రీహరి చొరవతో అధిక నిధులు కేటాయించడం పైన మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

### మదాసి కురువ, మదారి కురువలకు

# ఎస్సీ ధృవీకరణ పత్రాలు జారీ చేయాలి



వినతి పత్రం సమర్పిస్తున్న మాదాసి, మాదారి కురువ నాయకులు

**ఊట్కూర్, అక్టోబరు16 ప్రభాతవార్త:** తెలంగాణ మదాసి కురువ మదారి కురువ ఎస్సీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నారాయ ణపేట జిల్లా ఊట్కూరు మండల కేంద్రంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లా డుతూ మదాసి కురువ మదారి కురువ సమాజానికి తక్షణం ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ ప్రభుత్వంఈ సమస్యను పట్టించుకోని వేళలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు మాట్లాడుతూ గతంలో కొంత మందికి పొరపాటున బీసీ కుల ధృవీకరణ పత్రాలు జారీ అయ్యాయని, రెవెన్యూ అధికారులు ఆ తప్పును సరిదిద్దుతూ వారందరికీ ఎస్సీ కుల ధృవీకరణ పత్రాలు మళ్లీ ఇవ్వాలని కోరారు. అధికారులు మౌనం వీడి సమస్య పరిష్కా రానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా అధ్యక్షుడు చి. వెంకటన్న, ప్రధాన కార్యదర్శి గడ్డంతిప్పన్న, మక్తల్ తాలూకా అధ్యక్షుడు అంజప్ప, నారాయ ణపేట తాలూకా అధ్యక్షుడు బండి హనుమంతు సింగారం, కడు మూర్ బాలరాజు, ఊట్కూరు మండల అధ్యక్షుడు పొర్ల లింగప్ప, నారాయణపేట మండల అధ్యక్షుడు ఆశప్ప, జిల్లా ఉపాధ్యక్షులు బైరంకొండ వెంకటప్ప, గునపోల్ల వెంకటప్ప, కుల సంఘం నాయకులు భూత్పూర్ హనుమంతు, మక్తల్ నర్సింలు, ప్రధాన కార్యదర్శి సిద్దు తదితరులు పాల్గొన్నారు. తరువాత ఎమ్మార్వో కార్యాలయం సమీపంలో నిర్వహించిన ప్రెస్‌మీట్ ద్వారా వారు తమ ఆవేదన వ్యక్తం చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మా కుల ధృవీకరణ పత్రాలు వెంటనే ఇవ్వాలి – మా హక్కులు తిరిగి సాధించాలి" అంటూ నినాదాలు చేశారు.

## నేడు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన

**దామరగిద్ద, అక్టోబరు 16 ప్రభాతవార్త :** చీఫ్ జస్టిస్ బి.ఆర్‌గవాయి పై దాడి చేసిన అడ్వకేట్ రాకేష్ కిషోర్ ని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలి. ఈ ఘటనపై లోతైన విచారణ జరిపి దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి క్రిమినల్ కేసులు బుక్ చేయాలి. మరల ఇలాంటి ఘటనలు జరగకుండా కఠినంగా వ్యవహరించాలి. పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్ గవాయి మీద జరిగిన దాడిని ఖండిస్తూ, దాడికి పాల్పడ్డ అడ్వకేట్ రాకేష్ కిషోర్‌ను తక్షణమే అరెస్ట్ చేయాలని అలాగే దాడి వెనుక ఉన్న శక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి, విహెచ్పిఎస్‌ల ఆధ్వర్యంలో నేడు ఎమ్మార్వో ఆఫీస్‌ముందు నల్లజెండాలతో దళితుల ఆత్మగౌరవ నిరసన ప్రదర్శన ర్యాలీని నేడు నిర్వహించనున్నారు. నిరసన కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని. ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జ్ జీకే వెంకటప్ప, దామరగిద్ద టౌన్ ప్రెసిడెంట్ వై. రాజేశ్వర్ కోరారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయండి

**మొదటి పేజీ తరువాయి భాగం..**

ఇండ్లు నిర్మాణ దశలో ఉన్నాయో వివరాలు అడిగి తెలుసుకున్నా రు. నిర్మాణ పనులు నాణ్యతతో పాటు వేగంగా సాగాలని, మంజూ రైన ఇండ్లు ప్రారంభించకుండా వదిలేస్తే తగిన చర్యలు తీసుకో వాలని కలెక్టర్ హెచ్చరించారు. ప్రతి అర్హుడు త్వరగా గృహం పొందేలా అధికారులు కృషి చేయాలన్నారు. పేదల గృహ కళ నెరవేర్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని లబ్ధిదారులు తమ ఇళ్ల నిర్మాణ పనుల గురించి వివరించారు. కొన్ని ఇండ్లు వివిధ దశలో ఉన్నాయని, మరికొన్నింటిలో పనులు త్వరలో ప్రారంభమవుతాయని అధికారులకు తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంట మండల తహసిల్దార్ జాకిర్ ఆలీ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్ మరియు ఇంజినీరింగ్ విభాగ అధికారులు ఈ తనిఖీలో పాల్గొన్నారు.

## శుభకార్యంలో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

**భూత్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని అమిస్తాపూర్‌కు చెందిన కాంగ్రెస్ ఓబీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఆగిరి రవి కూతురు ఆగిరి కావ్య శారీ ఫంక్షన్ గురు వారం ఘనంగా జరిగింది. ఈ శుభకార్యానికి ముఖ్యఅతిథిగా దేవర కద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూధన్‌రెడ్డి(జీఎంఆర్) ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారి ఆగిరి కావ్యను ఆశీర్వదించి వారి తల్లితండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అరవింద్‌కుమార్‌రెడ్డి, భూత్పూర్ పట్టణకాంగ్రెస్ అధ్య క్షుడు లిక్కినవీన్‌గౌడ్, మండలకాంగ్రెస్ అధ్యక్షుడు కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్‌గౌడ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు రేకులపాటి భూపతిరెడ్డితో పాటు నాయకులు మశ్చేందర్, కోరె పవన్, మట్టి ఆనంద్, కెంద్యాల రాజేష్, మల్లేష్, దెంది లక్ష్మీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డిగ్రీ కాలేజ్ మరియు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని వినతి

**అయిజ అక్టోబర్ 16, ప్రభాతవార్త:** మండల కేంద్రంలో డిగ్రీ కళాశాల మరియు వసతి గృహాలు తక్షణమే ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురవ పల్లయ్య ఆధ్వర్యంలో గురు వారం మండల తాసిల్దార్ జ్యోతి కి ఆయా కళాశాల విద్యార్థులచే వినతి పత్రం అందించారు ఇందులో భాగంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుండి ఆయా కళాశాలల విద్యార్థులు ర్యాలీగా బయలుదేరి తాసిల్దార్ కార్యాలయాన్ని ముట్టడించారు అనంతరం వారు మాట్లా డుతూ మండల కేంద్రంలో 9 కాలేజీలు ఉన్నాయని సంవత్స రానికి సుమారు 1000 మంది విద్యార్థులు కాలేజీ విద్యను అభ్యసించి పై చదువులకై వెళ్లేందుకు స్థానికంగా ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ లేక విద్యార్థులు ఇతర ప్రాంతాలకు వెళ్లి చదువుకోవాలన్న తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు అలాగే కాలేజీల విద్యా ర్థులకు వసతి గృహాలు లేకపోవడంతో మండల పరిసర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు రవాణా సౌకర్యం లేక మధ్యనే చదువుకు దూరం అవుతున్నారని తెలిపారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పం దించి డిగ్రీ కాలేజీ మరియు వసతి గృహాలు ఏర్పాటు చేయాలని లేని పక్షంలో నిరాహార దీక్షలకు పూనుకుంటామని హెచ్చరించారు. బిఆర్ఎస్వి నాయకులు తులసిగౌడ్, రాజు, అశోక్ గౌడ్, రామాంజ నేయులు ప్రవీణ్, ఆది, కేశవ్, నరేష్, రమేష్, నరసింహ, నేత్ర మరియు ఆయా కళాశాల విద్యార్థులు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించిన మున్సిపల్ కమిషనర్

**నారాయణపేట టౌన్, అక్టోబరు16 ప్రభాతవార్త:** నారాయణ పేట పట్టణ పరిధిలో మెయిన్ రోడ్డు ఇరువైపులవున్న బహిరంగ ప్రదే శంలో చెత్తనుపారిశుద్ధ్య కార్మికులచే శుభ్రం చేయించడం జరిగింది. పనులను మునిసిపల్ కమిషనర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య మాట్లాడుతూ వ్యా పారస్తులు తమ దుకాణాలకు సంబంధించిన చెత్తను పురపాలక సంఘానికి చెందిన స్వచ్ఛ ఆటో లేదా స్వచ్ఛ ట్రాక్టర్‌లోనే వేయా లని బహిరంగ ప్రదేశాలలో, రోడ్డుకు ఇరువైపుల చెత్తను వేయ రాదు, వేసినచో లేదా చెత్త వేస్తూ పట్టుబడితే జరిమానా విధించడం జరుగుతుందని తెలపడం జరిగింది.

## వర్షాలకు నష్టపోయిన పంటలకు పరిహారం ఇవ్వాలి

**ఊట్కూర్, అక్టోబరు 16 ప్రభాతవార్త :** ఇటీవల అధిక వర్షాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతి న్నాయని వ్యవసాయ కార్మిక సంఘం ఊట్కూరు మండల నాయ కులు జోగుశంకర్ పేర్కొన్నారు. నిడుగుర్తి గ్రామంలో రైతు వెంకట ేష్ పొలాన్ని జోగు శంకర్ నాయకత్వంలో పరిశీలించిన సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ "ఎకరాకు పదివవేలకు పైగా ఖర్చు పెట్టినా ఒక క్వింటాలు కూడా పత్తి దిగుబడి రాని పరిస్థితి ఏర్ప డింది. రైతులు ఆర్థికంగా దెబ్బతిన్నారు, అంతేకాదు, పండిన పంటకు కూడా మార్కెట్లో తక్కువ ధర మాత్రమే లభిస్తోంది అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం రైతులనుఆదుకోవాలని, వర్షాలకు నష్టపోయిన రైతుల కు తక్షణమే పరిహారం ప్రకటించాలని, అలాగే పత్తి కొనుగోళ్ల కోసం ప్రభుత్వమే సిసిఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయా లని శంకర్‌డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు మగు లప్ప, చిన్న బుగప్ప, జోగు నాని, గణేష్, దొబ్బలి సునీత, కురువ జయమ్మ, కురువ ప్రవళిక, కురువ మణెమ్మ పాల్గొన్నారు.

## మళ్లీ జీఎంఆరే కావాలి

**-సమన్వయ కమిటీ సమావేశంలో ముక్తకంఠంతో మూడు మండలాల కాంగ్రెస్ నాయకులు**

**భూత్పూర్, అక్టోబర్ 16, ప్రభాతవార్త:** జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు (డీసీసీ)గా మళ్లీ గవినోళ్ల మధుసూధన్‌రెడ్డే(జీఎంఆరే)కావాలంటూ భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల మండలాల కాంగ్రెస్ నాయకులు ముక్తకంఠంతో కాంగ్రెస్ పరిశీలకుల ముందు తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేయడంతోపాటు రెండు చేతుల్తో జీఎంఆర్‌కు జేజేలు పలి కారు. డీసీసీ అధ్యక్షుని ఎన్నిక కోసం గురువారం అడ్డాకులలో మూడు మండలాలు(భూత్పూర్, మూసాపేట, అడ్డాకుల)లకు చెందిన కాంగ్రెస్ నాయకులతో ఏర్పాటు చేసిన సమన్వయ కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు. అధ్యక్షుని ఎన్నిక కోసం ప్రస్తావన వచ్చి నప్పుడు మూడు మండలాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ముక్తకంఠంతో జీఎంఆరేమళ్లీ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు (డీసీసీ)కావాలనిచేతులెత్తి తమసంపూర్ణ మద్దతు తెలిపారు.

## బీసీలకు దక్కాల్సిన న్యాయం కోసం పోరాడుదాం

**బీఆర్ఎస్ రాజాపూర్ మండల అధ్యక్షులు శ్రీశైలం యాదవ్**

**రాజాపూర్, అక్టోబరు 16 ప్రభాతవార్త:** గత కొన్ని సంవత్సరాలుగా బీసీలకు అన్యాయం జరుగుతూనే ఉందని, బీసీలకు దక్కాల్సిన న్యాయం కోసం పోరాడాల్సిన సమయం వచ్చిందని, రాజ్యాంగం కల్పించిన హక్కులను కాపాడుకునేందుకు ఈనెల 18న బీసీ జేఏసీ తలపెట్టిన రాష్ట్ర బంద్‌కు బీసీలు అధిక సంఖ్యలో పాల్గొనాలని బీసీ నాయకులు, బీఆర్ఎస్ రాజాపూర్ మండల అధ్యక్షులు మేకల శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఈమేరకు ఆయన మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇచ్చాకే ఎన్నికలకు వెళ్లాలన్నారు. చట్ట ప్రకారం షెడ్యూల్ 9 ప్రకా రం ఎన్నికలకు పోవాలని, సీఎం రేవంత్‌రెడ్డి తమకు ఇష్టమొ చ్చిన్నట్లు వ్యవహరించడం సరైంది కాదన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అలు చేసే వరకు వారి వెంట పడుతూనే ఉంటామన్నా రు. చట్టమే లేనిది జడ్జీలు తీర్పు ఎలా ఇస్తారని శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు. 18వ తేదీన రాష్ట్ర బంద్‌లో జడ్చర్ల నియోజకవర్గంతో పాటురాజాపూర్ మండల ప్రజలు, బీసీనాయకులు పార్టీలకతీతంగా పాల్గొని బీసీల హక్కులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని శ్రీశైలం యాదవ్ పేర్కొన్నారు.